# వక్రించిన జీవితాలు

శ్రీ 'భాను'

సాయంత్రం వర్షం కురిసినప్పటికీ రేగిన కొద్ది దుమ్మును లేపుకుంటూ వెళ్ళిన లారీనిచూస్తూ, గేటు వేసి హేండ్ సిగ్నల్ లైటు వెలిగించబోతున్న నాగయ్యకు అలారమ్ సిగ్నల్ చేసిన మూడు రింగ్సు వినిపించాయి. గబగబా లైటు తుడుచుకొని వెలిగించుకోగానే అలారమ్ సిగ్నల్ ఒకటే మోత చేయడం ప్రారంభించింది. అంటే—ప్రక్క స్టేషన్‌లో రైలు బండి బయలుదేరిందన్నమాట. 'ఓయబ్బ! ఐదున్నరకు రావల్సిన బండి ఎనిమిదింటికి వస్తూ యేం తొందరబ్బా' అనుకొంటూ లేచి స్టేషన్‌లోకి బయలుదేరాడు.

జనం ఆతృతగా, చిన్నపిల్లల్లాగా బండి పొలకువ గమనిస్తున్నారు. బండి ఆలస్యంగా వస్తున్నప్పటికి వేసవికాలం చలివేందరలో నీళ్ళు త్రాగిన తృప్తి వాళ్ళ ముఖాల్లో ద్యోతకమవుతున్నది. కొంతమంది రైళ్ళ ఆలస్యానికి గల కారణాలు చర్చిస్తున్నారు. కొందరు వింటూ నోరు తెరచుకొని నిలబడ్డారు. ఇంజన్‌లైటు దూరానికి మినుక్కు మినుక్కుంటున్న ఆశలాగా సమీపించేకొద్దీ ప్రకాశవంతమవుతున్నది. వ్యాధిలాగా వ్యాపించిన చీకటిని సూర్యకిరణంలా భేదిస్తున్న దా ఇంజనులైటు. ఈ సన్నివేశాలు సామాన్యమైపోయిన నాగయ్య 'అల్ప సంతోషులు' అన్నట్లు మీసాలలో నవ్వు దాచుకొని ప్లాటుఫారం చివర నుంచున్నాడు హేండ్ సిగ్నల్ లైటులో.

రైలుబండి ఆదుర్దాగా వచ్చింది. రెండు నిముషాలు ఆగింది. కూత వేసి కదిలింది. రైలు దిగిన ప్రయాణీకులు జిడ్డుగారుతున్న ముఖాలతో, నలిగిపోయిన బట్టలతో టిక్కట్లుయిచ్చి మందంగా కదులుతున్నారు. నాగయ్య యాంత్రికంగా టిక్కట్లు పుచ్చుకొని స్టేషన్ మాష్టరుకిచ్చి 'కిరసనాయిల్ పొదుపు'కోసమని రెండు లైట్లు ఆర్పి, టిక్కట్లు సార్టు చేసుకుంటున్న స్టేషన్ మాష్టరు దగ్గర వినయంగా నిలబడ్డాడు. టిక్కట్లు సార్టుచేసి తలయెత్తి 'ఏం నాగయా! ఈరోజు 'రెస్టుగివర్' రాలేదా? నువు మంచివాడవయా. చాలా సార్లు యెగనామం పెట్టాడుకదూ నీకు? చెప్తాను. వాడి పని చెప్తాను ఒక'టీ. ట్వంటీ' యిప్పిస్తే తిక్కకుదురుతుంది. ఉద్యోగంలో అజాగ్రత అయితే ఎట్లా.ఇదుగో యీ టీ తాగు. ఈరోజు లెవెంటీనైన్ లేటుగా వస్తుందీ; గేటు జాగ్రత్త. ఇదీ ఉద్యోగం! అంతా రెస్‌పాన్సుబిలిటీ' అన్నాడు స్టేషన్‌మాష్టరు.

మాట్లాడకుండా నెమ్మదిగా అడుగులు వేసుకొంటూ గేటుహౌసు దగ్గరకు వచ్చాడు. పలుచగా జనం వెళ్తున్నారు. చూస్తూ నిలబడ్డాడు.

దూరంగా సినిమాహాలుపైన లైట్లు కనబడుతున్నాయి చెట్లలో నుండి. చెట్లు చీకటిలో భయంకరంగా కనబడుతున్నాయి. దూరంగా ఎక్కడో ఎద్దుల మువ్వల చప్పుడు చిరుతరంగాలమీద లీలగా వినవస్తూ వున్నది. వాతావరణంలో శీతల వాయువు రక్తానికి కథలు చెపుతున్నది. మనసు మధుర స్మృతులను నెమరు వేసుకొంటున్నది.

నాగయ్యతో మాట్లాడడానికి మనుష్యులు ఎవరూలేరు. చెవుల మీదుగా కండువాను లాక్కున్నాడు. గేటు దిమ్మమీద కూర్చొని ఆకాశంవైపు దృష్టి సారించాడు. హేమంతకాలపు ప్రశాంతఆకాశం దీపావళి పండుగ చేసుకొంటున్నది. కీచురాళ్ళు గొంతులెత్తి సంగీతసాధన చేస్తున్నాయి. ఈలకోళ్ళు 'గీ' పెడుతున్నాయి. ప్రక్కనేరేడుచెట్టుమీదనుంచి కాకుల దంపతులు, దానిప్రక్క మామిడి చెట్టుమీదనుండి చిలుకల దంపతులు ప్రణయరహస్యాలు మాట్లాడుకొంటున్నాయి.

చెవులు రిక్కించి వింటున్నాడు. జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. అంత ప్రత్యేకత ఆ వాతావరణంలో వున్నదని కాదు. ఆ వాతావరణంఅంటే నాగయ్యకు ఒక విధమైన అప్యాయత, సన్నిహితత్వం, కృత్రిమ సంతృప్తి. విధి తనను రైల్వే ఉద్యోగంలో నెట్టినప్పటికి బాల్యంనుండి యిష్టమైన ప్రకృతిని దూరం చేయలేదుకదా? అనుకొంటాడు నాగయ్య. అందుకనే ప్రకృతిఅంటే మమకారం, గౌరవం, పూజ్యభావం యేర్పడ్డాయి అతని హృదయంలో.

—'ప్రకృతినుంచే జీవితానికి సరిపడే సంస్కరణా సామగ్రిని తీసుకోవచ్చు' అంటాడు నాగయ్య.

'చూడండి! అశాంతి యెటువంటిదైనా, ఎటువంటి వ్యక్తికైనా ప్రశాంతప్రకృతి ఉపశమనం యిస్తుంది' అంటాడు.

'కల్ల, కపటంలేక, రేపునుగూర్చి విచారించని, ప్రకృతిబిడ్డలైన పక్షులజీవితాలకన్న మన జీవితాలు ఏ మోతాదులో ఎక్కువ?'—అంటాడు.

నాగయ్య ఐదవఫారం ప్యాసయి ఎస్. ఎస్. ఎల్. సి. లో అడుగుపెట్టిన తర్వాత విరమించుకొన్నాడు చదువు. ఆ అల్ప సంస్కారమే యిటువంటి భావాల నగిషీకి కారణమైంది. రైల్వే ఉద్యోగం దొరికింది. జీవితంలో; సంఘర్షణలు, విషమపరిస్థితులు తలమీదుగా వెళ్ళిపోయాయి. ముప్పయి వసంతాలు గడిచిపోయాయి జీవితంలో. కాని జీవితం వసంతతుల్యం మాత్రం కాలేకపోయింది. సంవత్సరంలో వచ్చే శీతాకాలం, వేసవి కాలాలలాగా కష్ట ఛాయలు జీవిత ప్రాయంమీద లీలగా నడిచిపోయాయి.

ఇరవై సంవత్సరాల వయసులో అనుకొన్నయువతి, అవినీతిగా ప్రవర్తించినందువల్ల పెండ్లిచేసుకోలేకపోవడం మానసికంగా బాధపడడం, చేదుమందు మింగినట్లు ఇష్టం కాని పెండ్లి చేసుకోవడం, ఏదోవిధందా 'సంసారపు తంతు' సాగించడం, గానుగెద్దులాగా జీవితకార్యక్రమాన్ని నెట్టుకు రావడం, పిల్లలు,బారసాలలు, నామకరణాలు—భార్య మరణం—మనస్సువ్యాకులత—పిల్లల దైన్యస్థితి—ఒకదాని తర్వాత ఒకటి జరిగాయి. పిల్లల పోషణకొఱకు కొంతమంది పురుషుల్లాగా పెండ్లి చేసుకోదలచలేదు నాగయ్య.

'ఆద్యంతాలు జీవితంలో చవిచూశాను. నా కెందుకీ జంఝాటం మళ్ళా'' – అంటాడు వివాహప్రసక్తి యెవరైనా తెస్తే.

'వయస్సు దాటలేదుగా?' అంటే 'మనసుకు వృద్ధాప్యం వచ్చింది' అంటాడు.

'అసలు నీ వుద్దేశ్యం ఏమిటి?' అంటే 'బాదరబంది లేకుండా వుండడం' అంటాడు.

అందుకని సాధారణంగా నాగయ్యప్రవృత్తి తెలిసిన వాళ్ళెవరూ అతని దగ్గర వివాహవిషయం ఎత్తరు. నాగయ్య హృదయంలో బాధాపరావర్తనాల ఒత్తిడివల్ల పెండ్లికి యెన్ని సాకులు చెప్పినప్పటికి ఏదో వెలితిగా వుండేది అతని మనసులో.

సహజంగా మనసు ఒకరికి యివ్వవలసింది. అటువంటి 'వస్తువును' ఎవరైనా తన దగ్గరే వుంచుకొంటే సంప్రాప్తించే వేదన దుస్సహం—అనుకొంటాడు అప్పుడప్పుడు.

చేసేది రైల్వేఉద్యోగం. కనబడేది మనసును గిలిగింతలుపెట్టే అమృతస్వరూపాలు. సంయమనానికి పరీక్షగా వుండేదిఅప్పుడు. అట్టి సమయాల్లో నాగయ్య 'నా మనస్సు నాటకం ఆడుతున్నట్లుగావుంది. అయినా స్వభావాన్ని అణగించడం మనవశమా? సరిహద్దులు దాటకుండా వుంచుకుందాం' అనుకొనేవాడు.

ఈ భావాలు అతను ఒంటరిగా వున్నప్పుడు మనసులో కలిగే సంచలనాలు.

కాని సామాన్యంగా అత్తగారింట్లోవున్న తన యిద్దరు కొడుకుల పోషణకోసం తాపత్రయపడడమే కొంత మనశ్శాంతిగా వుండేది. ఈ జీవితానికి అంత తృప్తి చాలు అని అనుకొన్న రోజుల చాలా వున్నాయి.

అంతలో లారీ హారన్ విన్పించింది. ఆలోచనలకు అగాథం యేర్పడింది. తొందరగా గేటు దిమ్మమీదనుండి లేచి గేటు తాళాలు తీశాడు. లారీ రొద చేస్తూ చీకటిని ఛేదించి మార్గం స్పష్టం చేస్తున్న తన లైటు వెలుతురులో సాగిపోయింది. నాగయ్య లారీ కనుచూపు మేర వెళ్లేవరకు చూచి గేటు బిగించి, గేటు హౌసు వరండాలోనికి వెళ్ళి కూర్చున్నాడు. చల్లని గాలి జివ్వుమనేటట్లు వీస్తున్నది. బకింగ్‌హామ్ కాలువ గట్టుమీద సరుగుడు తోపులోనుండి గాలి ఒక విధమైన శబ్దంలో వీస్తున్నది. నేరేడు చెట్టుమీద పక్షుల కువ కువ వుండి వుండి వస్తున్నది. అంతలోనే 'కంటిన్యుయస్ అలారమ్' మూడు రింగులు మ్రోగించింది.

'అబ్బా! ఏమి గూడ్సుబండ్లు! వేళాలేదు పాళాలేదు. పాసింజరు బళ్ళకన్న యివే యెక్కువయిపోయాయి. రైల్వే వారికి యీ గూడ్సులేనంట లాభం తెచ్చేవి. పాసింజర్ బళ్ళు గంటలతరబడి ఆలస్యంగా వస్తున్నా పట్టించుకొనే నాథుడు లేడు. అయినా రైల్వే ఉద్యోగులం. మన కెందుకీ తగులాటం' అని నాగయ్య గేటులోనుండి బండిని చూస్తూ నిలబడ్డాడు. దూరంగా యెక్కడో పరుగెత్తించి తీసుకొస్తున్న ఎడ్లబండి శబ్దం నాగయ్యకు వినవచ్చింది. గూడ్సుబండి వచ్చేటప్పటికి అవతలకు వెళ్ళాలని కాబోలు ప్రయత్నం. కాని ఎడ్లబండి పదిగజాలుదూరంలో వుండగానే గూడ్సుబండి వచ్చేసింది. ఎడ్లబండి ఆసామికి ఎంత నిస్పృహగా వుంటుందో అనుకొన్నాడు, నాగయ్య. గూడ్సుబండి టకటక ధ్వని చేస్తూ ఆకు అలాన్ని తన వెంట తీసుకొనిపోయింది ఎనభై వాగన్లతో. గేటు తీశాడు. ఎడ్లబండి వెళ్ళిపోయింది.

'అబ్బ! ఎన్ని లక్షల విలువగల సామాన్లున్నయో గూడ్సులో. మొన్న ఎక్కడో నెమ్మదిగా వెళ్తున్నపుడు పదిమంది గూండాలు బట్టల బేలుల్ని లూటీ చేశారట. పాపం! గార్డుకు, డ్రైవర్‌కు టి. ట్వంటీలు పంపారట పై అధికారులు. ఈ రైల్వే ఉద్యోగం అంతా రెస్‌పాన్సిబిలిటీ. కాని జరిగేది అందుకు వ్యతిరేకం' అనుకోగానే మనస్సులో యెన్నడులేని భయభావం కలక్కుమంది—'గేటువేసివున్నప్పుడు వచ్చే లారీలను కూడా దోపిడి చేస్తారట యిక్కడ. అసలే క్రొత్తగా వచ్చాను. జాగ్రత్తగా వుండాలి. ఒకవేళ కర్మ వశాత్తు న సరకుల లారీలలో దోపిడి జరిగినప్పటికి తనకు ప్రమాదం లేకపోలేదు. పరమేశ్వరునిదయవల్ల లారీలు ఒంటిగంట తర్వాత రాకుండా వుండాలి' అనుకొని తన భయ సమర్థన గ్రహించి నవ్వుకొన్నాడు.

తొమ్మిదిన్నర అయింది. గేటుహౌసు దిమ్మకు ఆనుకొని కూర్చున్నాడు. అంతలో రెండు మూడు గుఱ్ఱపు బళ్ళు వచ్చాయి. లేచి గేటు తీశాడు. టకటక ధ్వని చేస్తూ వెళ్ళిపోయాయి. అప్పటినుంచి లారీలు, ఎడ్లబండ్లు అటు, యిటూ తిరిగే సమయం. సెవెంటీనైను యింకా రెండున్నర గంటలకు వస్తుంది అనుకొని అటు యిటూ చూశాడు. చీకటిలో రోడ్డుప్రక్కన గుట్టలు, మఱ్ఱి, రావిచెట్లు వివిధాకారాలలో భయంకరంగా కనబడుతున్నాయి. ఈత చెట్లకు వ్రేలాడుతున్న బంగారు పిచ్చికలగూండ్లలోనుండి కీచు కీచు ధ్వనులు వినవస్తున్నాయి. చెట్ల తలమీద చిగురాకులపైన చుక్కలు ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. ప్రకృతి నిద్రపోతూవుంటే వచ్చే ఉచ్ఛ్వాసనిశ్వాసాలలాగా రక రకాల జీవుల కంఠనాదాలు ధ్వనిస్తున్నాయి.

పెట్రోలు డ్యూటి మనుష్యులు గేటుమీదుగా నాగయ్యను పలకరిస్తూ వెళుతున్నారు. వాళ్ళ మనసుల్లో భయాం

దోశనలు కదులుతున్నాయి. సినిమా వదిలి పెట్టిన జనం పలచగా వెళ్తున్నారు. రికార్డులు వినబడుతున్నాయి. లారీలు, బండ్లు అప్పటికి రావడంలేదు. అందుకని గేటుహౌసు దిమ్మ కానుకొని మాగన్నుపెట్టి నిద్రపోయాడు.

లారీ హారన్‌మోత భీకరంగా నిశ్శబ్దవాతావరణాన్ని కలచగానే నిద్రలోనుండి ఉలిక్కిపడిలేచాడు నాగయ్య. గేటు తీశాడు. సరకుల లారీ బరువుగా కదిలి వెళ్ళింది. గేటుహౌసు లోనికి రాగానే అలారమ్ సిగ్నల్ రెండుసార్లు మ్రోగింది. స్టేషన్లో గణగణమని బెల్ కొట్టారు. రెండు మూడు నిముషాలైన తర్వాత కంటిన్యూయస్‌గా అలారమ్ మ్రోగడం ప్రారంభించింది. అంటే—సెవెంటీనైను ప్రక్క స్టేషనులో బయలుదేరిందన్నమాట.

నాగయ్య హేండ్‌లైటు తీసుకొని స్టేషన్‌లోనికి వెళ్ళి ఆపివేసిన దీపాలు వెలిగించాడు. చెదురుగా ప్రయాణికులు కూర్చొని వున్నారు. కొందరు నిద్రనుండి లేస్తున్నారు. ఇంజన్‌లైటు సుదూరాన తాళ్ళలోనుండి మినుక్కుమంటూ సమీపిస్తున్నది. ప్రయాణికు లందరు ఉత్సాహంగా లేచినుంచున్నారు.

రైలుపట్టాలు తెల్ల త్రాచుపాముల్లాగా మెరుస్తుండగా బండి స్టేషన్‌లో వచ్చి ఆగింది. రెండు నిముషాల్లో కదిలింది. నిద్రమత్తులో దిగిన ప్రయాణికులు టిక్కట్లు యిచ్చి నెమ్మదిగా నడుస్తున్నారు. నాగయ్య టిక్కట్లు స్టేషన్ మాష్టరుకుయిచ్చి లైట్లు ఆర్పి గేటు దగ్గరకు బయలుదేరాడు. వెళ్తున్న ప్రయాణికులు ఒరసుకోగా దారి ప్రక్కన కసింద చెట్లు వాసనను గాలిలోనికి వ్యాపింపజేశాయి. ఇంతకుపూర్వం నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద రోగి గుండెలోని స్పందనాల్లాగా కాళ్ళ చప్పుళ్ళు వినబడుతున్నాయి. ఏవో పక్షులు కలకల ధ్వానాలు చేస్తున్నాయి. పడమటనుండి నెమ్మదిగా పైకివచ్చిన చంద్రుని కాంతిలో పసుపుతోటలోని ఆకులమీద సాయంత్రం కురిసిన వర్షంలోని నీటికణాలు ప్రియుణ్ణిచూసి మెరుస్తున్న ప్రియురాలి కనుపాపల్లా వున్నాయి.

నాగయ్య గేటుదగ్గరకు వచ్చాడు. దూరంగా లారీ లైటు కన్పించింది. ముందుగానే గేటు తీశాడు. లారీ వెళ్ళిపోయింది. మళ్ళీ అటునుండి లారీ మోత విన్పించింది. వచ్చేవరకు నుంచున్నాడు. లారీ వెళ్ళిపోయింది. పదిహేను, ఇరవై నిముషాలు అటునుండిగాని, యిటునుండిగాని ఏమీ రాలేదు. తీసివుంచుదామనుకొన్నాడుకాని గూడ్సు బండ్ల బెడద కాబట్టి ముందు జాగ్రత్తకోసం గేటుతాళంవేసి, గేటుహౌసులోపల పక్క వేసుకొన్నాడు. లైటు ఆర్పాడు.

అరగంట గడిచింది. నాగయ్య ఏకాంతహృదయం గడచిన గాథలదాగుడుమూతలలో కన్నుమూసింది. అతని మనస్సు స్వప్నావస్థలో వుంది.

—సున్నితపు నడకలో, చీరె రెప రెపలతో ఓ ఆకారం దగ్గరకు వచ్చినట్లు—

—గాజుల గలగల, చామంతిపూల వాసన, చౌకరకపు పౌడరు కంపు నాశికారంధ్రాల్లో చోటు చేసుకొన్నట్లు—

—నిద్రా మనసులో ఏవేవో సమ్మోహనా పుష్పాలు వికసించినట్లు—

—ప్రాచీన అనుభూతుల స్పర్శ చవిచూసిన రక్తం మహోద్వేగంలో కుతకుతలాడి రోమాంచం కల్గించినట్లుకాగా—

నాగయ్యను ఎవరో లేపినట్లు మగతనిద్రలోనుండి లేచి బయటకుచూశాడు, ఎదురుగా—నల్ల మచ్చల తెల్ల చీరతో ఓ ఆకారం.

అతని గుండె గబగబ లాడింది. రక్తం రెపరెప మన్నది. కళ్ళు జిగేల్ మన్నవి. ఒళ్ళు గిల్లుకొని చూశాడు. శరీరంలో చేతనశక్తి కదిలింది.

ఎక్కడో చెట్టుమీద కాకిపిల్ల యేడుపు. ఈలకోళ్ళ భయానక స్వరాలు లయగా వినబడుతున్నాయి.

'కొంపదీసి దెయ్యం కాదుగదా?' నాగయ్య మనసులో మెరసిన ఆలోచన.

'అయినా యింతవర కెప్పుడూ ఇట్లా జరగలేదా? ఒక వేళ ఎవరైనా మనిషేనేమో?!' సంశయం కలిగింది.

'ఎవరక్కడ?' అప్రయత్నంగా ప్రశ్నించింది కంఠం.

ఆకారం కదల్లేదు. మెదల్లేదు. మాట్లాడలేదు.

'ఎవరక్కడ నుంచున్నది?' మళ్ళా బిగ్గరగా అరచాడు. ఈ మాటలు విన్నతర్వాత ఏవో పాదాల చప్పుడు వచ్చింది కానీ నాగయ్య మనసు అంత సునిశితంగా పనిచేయలేదు. హేండ్‌లైటు వెలిగించబోయాడు. అంతలో యిద్దరు మనుష్యులు అక్కడకు వచ్చారు.

'ఎవరు వాళ్ళు?' బయటకు వస్తూ ప్రశ్నించాడు.

"మేమేలేగురూ!' అంది ఒక కంఠం. స్త్రీ ఆకారం నుంచున్నది అలాగే.

'మేమంటే?" రెట్టించాడు నాగయ్య.

"మేం తెనాలి వెళ్ళాలండి. బండి లేదన్నారు. ఏలారేకన్నా వెళ్దామని యిక్కడకు వచ్చాం. ఈ అమ్మాయి మా అమ్మాయే" అన్నాడు ఇంకొకడు కొంచెం సభ్యతగా.

నాగయ్య గుడ్డి వెన్నెలలో వాళ్ళను పరిశీలనగా చూశాడు. ఒకడు నల్లగా, బలంగా వున్నాడు. చారల డ్రాయర్, కట్ బనియన్ తొడుక్కున్నాడు. మనిషి ముఖ కవళికలు కనబడ్డం లేదుగానీ, క్రూరమైన వాడిలా వున్నాడు. రెండవ మనిషి పంచె ఎగగట్టుకున్నాడు. నల్లషర్టు తొడుక్కున్నాడు. భావయుక్తంగా చిరునవ్వు నవ్వుతున్నాడు, మెలివేసిన కోరమీసాలలోనుండి.

గేటు హౌసు దిమ్మ కానుకొన్న స్త్రీ ప్రతిమలాగా నుంచున్నది. కొంచెం రంగుగలదన్నట్లుగా ముఖం చెబు

తున్నది. కన్నులు పూర్తిగా కనబడ్డంలేదుగాని కనుపాపలు చలాకిగా మెరుస్తున్నాయి. తెల్లని చీరమీద నల్లని పువ్వులు కాబోలు కనబడుతున్నాయి. తల దువ్వుకొన్నట్లుగావుంది వైఖరి. ఆమె తలలో చామంతిపూలు వాడిన వాసన కొడుతున్నాయి. ఆమెవిధానం చూడగా నాగయ్యను పరిశీలిస్తున్నట్టుగావుంది. ఆమెను చూస్తున్న నాగయ్యను, నాగయ్యను చూస్తున్న ఆమెను చూసి డ్రాయర్ వేసుకొన్న నల్లని మనిషి గంభీరంగా నవ్వాడు. ఆ నవ్వులో యేదో నిగూఢభావం వున్నదనిపించింది.

నాగయ్య కొంచెంసేపు వాళ్ళ ముగ్గురివైపు సాభిప్రాయంగా చూసి లోపలికివెళ్ళి పక్క బయటకు తీసుకొని వచ్చి కూర్చున్నాడు. కొంచెంసేపైన తర్వాత ఆ ముగ్గురు వరండామీద కూర్చున్నారు. ఆ స్త్రీ మాత్రం అక్కడే కూర్చున్నది మౌనంగా. ఆ యిద్దరు మొగవాళ్ళు ఒకరి ముఖం ఒకరు చూచుకొని, ఆ స్త్రీవైపు చిరునవ్వుతో చూశారు. ఆమె పెదవులు వంపుగా తిప్పి నవ్వింది. ఆ నవ్వు ఎక్కడో ఎప్పుడో పరిచయమైనదిగా అనిపించింది.

'మీది నైటు డ్యూటే కాబోలు! నిద్ర లేకుండా వుండాలికదూ? అబ్బ! కష్టం కదండి. వచ్చే పోయే లారీలకు గేటు తీస్తూ వేస్తూ వుండాలి. రైలుబండ్లకు టిక్కట్లు తీసుకోవాలి. అంతా బాధ్యతగల ఉద్యోగం, ఏమంటారు?' అన్నాడు మీసాల మనిషి.

"మీరన్నది నిజమే! ఏం చేస్తాం చెప్పండి. మా బాధ్యత నిర్వర్తించాలిగా మరి. పరిస్థితులు ఎలావున్నా తప్పదు" అని తన్ను పరిశీలనగా చూస్తున్న ఆమె వంక చూశాడు.

డ్రాయర్ తొడుక్కున్న మనిషి "పాపం!" అని సానుభూతి ప్రకటించి, రెండవ మనిషితో ఏదో గుస గుస మన్నాడు. ఆ మాటలు స్పష్టంగా వినబడలేదుగాని ఆడ మనిషి తన వైపు చూసి నవ్వినట్లుండం ఏదో సంశయానికి తావు యిచ్చింది. ఏదో మనసులో కదిలినట్లనిపించింది.

"చూడండి! మేము యిక్కడ పడుకొంటాం. మీరు నిద్రపోండి. గేటు, గీటు పనంతా చూసుకుంటాం. ఎవ్వరా వీళ్ళు అని అనుకోబోకండి. మనలో మనకి సహాయం. ఏమంటారు?'

నాగయ్య యేదో ఆలోచించి 'అవసరంలేదులెండి' అన్నాడు. అప్పుడు పంచె కట్టుకున్న మనిషి బయటకు వెళ్ళాడు.

"ఇదిగో గురూ! భయపడతావేంటి? లోపల పడుకో గురూ! ఏం పరవాలేదు" అని చెప్పి బయటకు వెళ్ళాడు ఆమె మాత్రం అక్కడే కూర్చున్నది. ఏ మానసిక దౌర్బల్యం తనను మౌనంగా వుంచిందా అని ఆశ్చర్యపడ్డాడు నాగయ్య. ఏమిటోలావుంది మనసు.

నాగయ్య ఒంటిమీద పూలు, పన్నీరు, తేళ్ళు, జెఱ్ఱులు పడి ప్రాకినట్లయింది. నాగయ్య మనసు ఏదో విషయాన్ని పసిపట్టి అర్థం చేసుకొన్నది. కాని అధిగమించలేకపోయింది.

నాగయ్యపక్క లోపలికి తీసుకొనివెళ్ళి కూర్చున్నాడు. ఐదు నిముషాలు అయింది. ఆ స్త్రీ తలుపుకు ఎదురుగా నిలబడింది. నాగయ్యకు అర్థమయ్యింది. సంతోషం, సంభ్రమం మనసులో దాగుడుమూతలాడుకొన్నాడు. ఉత్సాహం, ఉద్వేగం కుస్తీ పడుతున్నది.

బరువు, బాధ్యత, భవిష్యత్తు మనసులో కరుగుతున్నాయి.

ఆ అపరిచిత వ్యక్తి ముఖాన్ని చూడాలనేకాంక్ష నాగయ్య మనసులో కదిలింది. లైటు వెలిగించి వత్తి పెద్దది చేశాడు. చేత్తో పట్టుకొని ఆమె ముఖంవైపు తిప్పి చూశాడు.

—దట్టమైన కనుబొమలక్రింద విశాలమైన నయనాల్లో మినుక్కుమంటున్న కనుపాపలు, పొడుగైన మొన తేలిన ముక్కు, అందమైన వంపులో పలుచని పెదవులు, నల్లని ముంగురులు, పెదవుల దగ్గరగా కుడిబుగ్గమీద నల్లని పుట్టుమచ్చ—

అదే పుట్టుమచ్చ! అవే పెదాలు, అవే కనుబొమలు! అదే నవ్వు! నాగమణి! అవును నాగమణి!! పది సంవత్సరాల క్రిందట మనసును గిలిగింతపెట్టిన మనోజ్ఞనిరాశారేఖ! యౌవన లేబ్రాయంలో హృదయతంతుల్లో స్వనించిన విషాద స్వరం! మనసులో పాతవాసనలు కమ్ముకొన్నాయి.

* * * *

పదిసంవత్సరాలక్రిందట జరిగిన విషయం. కాలవ దగ్గర తాటితోపుదగ్గర పల్లె. ఆ పల్లెలో మల్లెపూవులాంటి పిల్ల నాగమణి. కాని సాధారణంగా 'నాగులా' అనేవారు.

తుంగపువ్వులు సిగలో తురిమి నాగమణి నడుస్తుంటే నాగస్వరానికి సమ్మోహితమైన నాగుబాముల్లా వుండేవారు చూచేవారు. వరిచేల గట్టుమీద నాగమణి గొంతెత్తితే దిక్కులు కరిగిపోయాయి. వినేవారి మనసులో మురిసిపోయేయి.

ఒకనాడు పట్నంనుండి సెలవులకు వస్తూ పొలంలో కలుపుతీస్తూ శ్రావ్యంగాపాడుతున్న నాగమణిని చూడగానే నాగయ్య మనస్సు క్షణం నిశ్చేష్టమైపోయింది. ఆ వూళ్లో వున్నప్పటికి ఎప్పుడో ఒకప్పుడు చూచే నాగమణి రూపంలోని తన్మయత రూపానికి తోడు కంఠంలోని మాధుర్యం నాగయ్యమనసును కట్టివేశాయి. అతని యౌవనోద్వేగం ఆమెతోడి పరిచయాన్ని కోరింది. అతని మనస్సు ఆమెను పలకరించే అవకాశంకోసం అర్రులు చాచింది.

ఒకరోజున సాయంత్రం సూర్యుడు చింతలతోపు వెనకనుండి అదృశ్యమవబోతున్నాడు. నాగయ్య కాలవగట్టు వెంబడే నడుస్తూ నీళ్ళలో ప్రతిఫలిస్తున్న అరుణ ఛాయల్ని పరికిస్తున్నాడు. ఆ సమయాన నాగమణి ఆ దారినే రావడం తటస్థించింది. నాగయ్య ఒళ్ళంతా కంపించిపోయింది. ఎలా మాట్లాడాలి? ఏమని మాట్లాడాలి? ఈ ఆలోచనలలో ఒళ్ళంతా చెమటలో నిండిపోయింది.

# వక్రించిన జీవితాలు

నాగమణి రెండు మూడు గజాలదూరం వెళ్ళింది. నాగయ్య గుటకలు మింగాడు. అంతలో 'అమ్మో' అని నాగమణి ఆగిపోయింది. మెరుపులా పరుగెత్తాడు నాగయ్య. నాగమణి వ్రేలితో దారికి అడ్డంగా చరచర పోతున్న మండ్రగబ్బను చూపింది. నాగయ్య మట్టిగడ్డలతో చంపాడు. కృతజ్ఞతాపూర్వకంగా నాగయ్యవైపు చూసింది. నాలుగు కళ్ళు కలుసుకొన్నాయి. మనసులో పూరేకులు వికసించాయి. హృదయాలలో లేతవెన్నెలలు కాశాయి.

అదే ప్రథమపరిచయం. క్రమంగా చిరునవ్వుల దాకా పెరిగింది. ఆమె నవ్వులో చల్లగాలికి మెల్లగా తలలూపే వరిచేల సౌందర్యం, అప్పుడే వికసించి లోకాన్ని చూసి నవ్వే మెట్టతామరపువ్వులోని సౌకుమార్యం, సూర్యోదయానికి తళుక్కుమని ఒళ్ళు విరుచుకొని పొంగిపోయే యేటి అలలోని అమాయకత్వం గోచరించేది.

నాగయ్య ఆమెను ప్రణయినిగా, ఆరాధ్యదైవంగా అర్థాంగిగా మనసులో చిత్రించుకొన్నాడు. వారి చిరునవ్వులలో, మూగ భాషణాలలో కొన్ని రోజులు గడచిపోయాయి. నాగయ్య పట్నం వెళ్ళలేక వెళ్ళేడు.

రోజులు, నెలలు గడిచాయి. నాగయ్య పట్నంనుండి తిరిగి వచ్చాడు ద్విగుణీకృతమైన ఉత్సాహంతో నాగమణిని చూడాలని. కాని పిడుగులాంటి వార్తను వినక తప్పిందికాదు. 'నాగమణిలేచిపోయిందని.' రక్తానికి జ్వరం వచ్చింది. హృదయానికి వ్యాధి వచ్చినట్లనిపించింది. ప్రపంచమే కనులముందు తిరిగినట్లనిపించింది. ప్రపంచంలో దేని ఉనికిని నిరార్థణగా నమ్మాలనే అనుమానం కల్గింది. మనసు మసకగా అయింది. విధి బలీయమనే సంగతి అనుభవపూర్వకంగా తెలిసింది అనుకొన్నాడు. హృదయానికి తగిలిన గాయం మానినా, మానిన గుర్తు మాత్రం మానలేదు. ఎప్పుడన్నా కలుక్కుమనేది. స్మృతి పథంలో దూరమైన రూపం. మనసులో మాసిపోయిన చిత్రాల రేఖలు ప్రస్తుతం యెదుట ప్రత్యక్షంగా గోచరించాయి.

*　　　*　　　*

ఆ వ్యక్తే యిప్పుడు ఎదుట నుంచొనివుంది. నాగయ్య రక్తం కుత కుత లాడింది. 'నన్ను గుర్తుపట్టలేదా? మతిమరుపా? ఉదాసీనమా' అనుకొన్నాడు. తన్ను మోసగించినందుకు ఉక్రోశం కల్గింది. మనస్సు "వంచకి, కళంకిని. . . ." యిత్యాది తిట్లను సృష్టించింది.

మొదట్లో యిష్టమైన వాడితో లేచిపోయిందేమోలే అని సమర్థించుకొన్నప్పటికి అది పతనమే! ఎందుకంటే అది సాంఘికాచారానికి భిన్నం గనుక. అయినప్పటికి చేసిన కార్యానికి జీవితాంతం కట్టుబడివుంటే పరిష్కారంవుంది. కానీ యింత భృగు పతనమా? అవినీతిస్పర్శకు కొంతవరకైనా సమర్థన వుందికాని అవినీతి బురదలోనే కూరుకుపోతే ఎలా? ఇంత చంచలత్వమా? ఇంత కుళ్ళుస్థితా? అని నాగయ్య మనస్సు పరిపరి విధాల ఆలోచించింది.

"బాగా తిడితే" మనసు ప్రశ్నించింది.

"ప్రస్తుతం ప్రయోజనంలేదు" అని సమాధానం చెప్పుకున్నాడు.

అంతలోనే కంటిన్యూయస్‌గా అలారమ్ మ్రోగింది. నాగయ్య బయటకువచ్చి నిల్చున్నాడు. ఆమెతో వచ్చిన యిద్దరు మనుష్యులు గేటుకు దూరంగావున్న గంగరావి చెట్టు దగ్గర బీడీలు కాలుస్తూ కనిపించారు. "ఆడదాని అవినీతి చర్యమీద ఆధారపడే అప్రయోజకులు!" అనుకొన్నాడు. ఆలోచనలాగా మంచు పలుచగా కురుస్తున్నది. ఆవేగంలా జివ్వుమని చల్లగాలి వీచింది. ఒంటిమీద వెంట్రుకలు నిక్కబొడిచాయి. ఎక్స్‌ప్రెస్ దూరంగా కనబడి రెండు నిముషాల్లోదాటిపోయింది, అనుకున్న ఆశ జారిపోయినట్లు. అంతవరకు లారీలు రావడం లేదు. రాకపోతే మంచిదే అనుకొని గేటుహౌసు దగ్గరకు వెళ్ళాడు. ఆమె తదేకంగా నాగయ్యను చూస్తున్నది.

లోపలికి వెళ్ళబోయాడు. ఆమె పమిటచెంగు ముంజేతికి తగిలింది. రక్తం క్షణంసేపు గుండెలో స్తంభించింది. వెనక్కు తిరిగి చూశాడు. భావసూచకంగా నవ్వుతున్న ఆమె ముఖం. చంద్రుడు మబ్బులదారుల్లో జంకుతూ వెళుతున్నాడు బైట. నాగయ్య మనసు ఒక్కసారి సమ్మోహితం అయింది. పూర్వపు అనుభవాల అంకురాలు హృదయాన్ని చీల్చుకొని మొలకెత్తబోతున్నాయి.

లోపలికివెళ్ళి ఆమెను పిలిచాడు. అటూ, ఇటూ చూచి వెళ్ళింది. దగ్గర నుంచున్నది.

"నీ పేరు?"

కిలకిల నవ్వింది. పూర్వపు నవ్వుకు యీ నవ్వుకు మార్పు లేదు, కాని ఈ నవ్వులో జీవంలేదు. ఏదో కృత్రిమత్వం చోటు చేసుకొన్నది.

"నాగ. . . . .రత్నం' మూతి వంపుగా తిప్పి నవ్వింది.

'నాగమణికదూ?" మనస్సులోనుంచి అప్రయత్నంగా వచ్చిన మాట అది. ఎందుకన్నానా అని ఆమె ముఖం చూశాడు.

"ఆఁ. . . . .కాదు. . . . . .కా. . .దు" అని వెనక్కు అడుగేసింది. ఆమె ముఖంలో ప్రకాశిస్తున్న చంద్రుడు ఒక్క

సారి నిముషంసేపు మబ్బుల మాటున దాగితే వచ్చే చీకటి తెరల్లాగా, ఏవో ఆలోచనతెరలు కమ్ముకొన్నాయి.

"ఏః . . . .అట్లా అయ్యావు?"

"ఏమీ. . . . . . .లేదు. . . . . .కాలిక్రింద ఏదో కదిలినట్లనిపించింది" అన్నది. నాగయ్య చూడ దలుచుకోలేదు. కారణం అది కాదని అతనికి తెలుసు.

"మనసులో ఏదో కదిలినట్లపించింది" అని ఆమె ఉద్దేశ్యం అయివుంటుందా? అనుకొన్నాడు.

"నీ పేరూ. . . . .నాగులూ. . . . .అంటే బావుండదూ?" అని సూటిగా కన్నుల్లో చూచాడు.

"ఎందుకు బాగుండదు బాగుంటుంది" కళ్లల్లో నీటితెరలు మిలమిల మెరిసినట్లనిపించింది. ఆమె మనసు రంగుల రాట్నం వెనుకటి ఉనికిని పసికట్టింది.

"మీదేవూరు?"

'చెడిపోయిందానికి ఒక వూరేంటి" బాధా మిళిత స్వరం.

"నేను ఆ మాట అనలేదే' ఆమెను మాట్లాడించాలనే అడిగాడు.

"నేనే చెబుతున్నాగా"

"అయితే నీకు సంబంధించిన విషయం స్వయంగా నువ్వే చెబుతావా?"

"అవసరం అయితే. . . . . .అంతే!"

"ఇంతకీ మీ వూరు" రెట్టించాడు.

"నాలోకన్నా మీకు వూరిలో పనా?"

"పనివుంటేనే అడగాలా?"

"అవును" విషాదఛాయల కలగలుపుగా నవ్వింది. అది పరాజయధ్వజం అనిపించింది నాగయ్యకు.

ఎందుకోగాని ఆ నవ్వును చూడగానే నాగయ్య రక్తం ప్రాచీన అనుభూతులకోసం తిరగబడింది. ప్రతిజ్ఞలు, మాటలు మసగ్గా అయిపోయాయి. దగ్గరలోవున్న తుమ్మచెట్టుమీద పిచ్చికల సరాగం వినిపించింది.

నాగయ్య దేహం తాపాన్ని జయించలేకపోయింది.

అపుడు సంయమనం 'అయ్యో' అంది. అవినీతి అట్టహాసం చేసింది.

—"నాగమణి చెడిపోయింది. నువ్వు ఈ క్షణంలో చెడిపోబోతున్నావు. నీకు నాగమణికి ఏమిటి భేదం?"—అని అంతరాత్మ ప్రారంభించింది.

—"నాగమణి చెడిపోయింది గనక యింకా చెడినా ఒకటే చెడకున్నా ఒకటే! ఒక్క క్షణికసుఖంకోసం ఆశయాల్ని వ్యక్తిత్వాన్ని బలిచేసుకొంటావా? ఇంతవరకు నిర్మలంగా ప్రవర్తిస్తూవచ్చి ఈ క్షణంలో జారిపోతావా? క్షణికోద్రేకంలో నీ ఉద్యోగధర్మాన్ని కూడ నిరసిస్తావా? పశుప్రవత్తి నీలో ప్రతిబింబింపజేస్తావా?" అని మనసులో ఎవరో ప్రబోధించినట్లనిపించింది.

సాగరతరంగంలా ఉపశమించి నాగయ్య బయటకు వచ్చాడు. చంద్రుడు పలుచని మబ్బుల్లో దాగి దాగి వెళ్తున్నాడు. మనస్సులో చీకటి వెలుగులు, ఉత్సాహోద్వేగాలు సంతోషవిభ్రమాలు రంగుల రాట్నంలాగా తిరుగుతున్నాయి, చల్లని వాతావరణం రక్తాన్ని ప్రకోపింప చేస్తున్నది. చెట్ల మీద పక్షుల కిలకిలలు భావాలకు పదును పెట్టున్నాయి. ఆ యిద్దరు మనుష్యులు దూరాన మర్రిచెట్టు మొదలు దగ్గర కూర్చొని లారీలను చోరీ చేద్దామని బీడీలు కాలుస్తూ అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళ అవకాశానికి అవకాశం యివ్వడానికి గేటుహౌసులో ఒక జీవి శరీరాన్ని 'దానం' చేయబోతున్నది. ఎక్కడ న్యాయం? ఎక్కడ నీతి?—ఈ మాట అనుకోగానే నాగయ్యగుండె ధైర్యాన్ని పుంజుకుంది. సంయమనానికి పట్టు సడలింది. చిరంతన కోర్కెల తీవలు గుండెను చుట్టాయి. మనసు తర్కం ప్రారంభించింది.

"నాగమణి నేను ప్రేమించిన యువతి. కాల ప్రభావం వల్ల చెడిపోయిందే కావచ్చు. కాని యిప్పటికీ నా మనస్సు ఆమె పొందు కోరుతున్నది. అనాటి నా కోర్కె సఫలం అవుతుంది. అందుబాటులోవున్న అవకాశాన్ని వదలడానికి నేను ఋష్యశృంగుణ్ణికాదు. నేను సంయమనం వహిస్తే నాకు వచ్చే ప్రత్యేకత ఏమిటి? ఇది తప్పు అని ఆ యిద్దరకు తెలియదా? మరి యింకేం? లోకంలో నే నొకడినే" అని సమర్థించింది మనస్సు.

కల్లోలమైన మనస్సు ప్రశాంత మోహసాగరమైంది. తృష్ణ నిశ్చలపర్వతం, అయింది. హృదయంమధురక్షణం కోసం రాగం పాడింది. లోపలికి వెళ్ళాడు.

స్థాణువులా నిల్చుంది ఆమె. దగ్గరకు వెళ్ళాడు నాగయ్య. ఆమె కదల్లేదు. తల దించుకొనివుంది. భుజం పట్టుకొని వూపాడు. ఏమీ మాట్లాడలేదు. అతని మోహం పరిధిదాటింది. కన్నుల్లో రక్తం ఉబికింది. పట్టరాని తమకంతో ఆమెను గాఢంగా కౌగలించుకొన్నాడు. పెదవులు ఆమె పెదవులకోసం వెదికాయి. "నాగులూ. . . . . .నాగులూ" అన్నాడు. అతని కంఠంలో ప్రేమ, దైన్యం ఏదో అమూల్యమైన వస్తువు పోగొట్టుకొని దొరికినప్పటి ఉత్కంఠ హృదయంలో చిరనివాస మేర్పరుచుకొన్న ఏదోబాధ స్ఫురించాయి. నాగమణి కన్నుల్లో

నుంచి వేడి కన్నీటి బొట్లు నాగయ్య చెంపలకు తాకాయి. అమోఘమైన చిరంతన ప్రేమ, హృదయాన్ని మధించగా స్రవించిన బాధాకణాలా అవి! కానీ అవి చిహ్నాలో నాగయ్య గమనించలేదు. ఆమె అతన్ని దగ్గరగా పొదువుకుంది. అపార వశ్యం కొన్నిక్షణాలు మాత్రమే.

అంతలో గేటు దగ్గరనుండి "ఏయ్ నాగూ! బయటికిరా" నాగయ్య కా మాటలు ఎక్కడో హృదయాంతరాంతంలో విన్పించాయి. మనసుపళ్లెంనుండి మధురభావ పదార్థాన్ని యెవరో లాగినట్లనిపించింది.

"నాగమణి! బయటకురావే. నాలుగయినట్టుంది. వ్రతం చెడ్డా ఫలం దక్కాలా' అని కేక విన్పించింది. నాగయ్య నాగమణి పుష్పాల్లాగా, మేఘశకలాల్లాగా విడిపోయారు. ఆమె నాగయ్య కన్నుల్లోకి దీనంగా చూచినట్లనిపించింది. చరచర బయటకువెళ్ళి వాళ్ళను కలుసుకొన్నది.

'ఏంనాగమణి! ఏమీ లాభంలేకపోయింది. నీకైనా గిట్టిందా ఏమన్నా. . . . .' అని డ్రాయర్ తొడుక్కున్న నల్లవాడు అంటున్నాడు.

'ఛా నోర్మూయ్'' అంది నాగమణి కంఠం. కంఠంలో దైన్యం, పగ, ఏహ్యాభావం స్ఫురించాయి.

"సరే నడవండి...........ఒక్కలారీ కూడా రాలేదు. దురదృష్టం. పదరా పోతురాజు. . . . .పద' అంది కోరమీసాల మనిషి గొంతు. నాగయ్యకు స్వప్నంలో లాగ విన్పించాయి ఆ మాటలు. బయటకువచ్చి రోడ్డుమీద నుంచున్నాడు. చెంపలు తడిగా వున్నట్లుండగా తుడుచుకొన్నాడు. నాగమణి కన్నీటి చెమ్మ అని తెలియదు మరి!

నిద్ర లేచిన పక్షుల కలవరింతలలో మసక చీకటి. ముగ్గురు మనుష్యులు నడుస్తున్నారు. ముందు యిద్దరు. వెనక ఒక్కరై. శూన్యహృదయంతో చూస్తూ నిలబడ్డాడు నాగయ్య. ఆమె వెనుతిరిగి నాగయ్యను చూచి చెయ్యి వూపినట్లనిపించింది. అప్రయత్నంగా చెయ్యి వూపాడు. గుండెలో— దిగులు, బరువు, బాధావ్యాకులత, అగాధమైన అసంతృప్తి కలుక్కుమంది.

చూస్తూ నిలబడ్డాడు నాగయ్య. నాగమణి వెనుతిరిగి చూస్తూ వెళ్ళుతున్నట్లనిపించింది. నాగయ్య మనసులో అలనాటి పల్లెపట్టు, పచ్చని వరిచేలు, మనోహరమైన ప్రకృతి కనులముందు నాట్యమాడి మాయమైంది. ఏదో నిర్లిప్తత హృదయంలో తావు చేసుకొన్నది. 'ఒక్కసారి హృదయంలో చోటు యిస్తే, పరిస్థితులు విషమంగా పరిణమించి అనుకోని సంఘటన సంభవిస్తే తర్వాత కూడా ఎంత బాధ. . . . ఎంత వ్యథ. . . . .' అంది నాగయ్య మనస్సు.

ఆ ముగ్గురుమనుష్యులు ఆ వంక దారిలో మాయమయ్యేవరకు నిలబడ్డాడు నాగయ్య. గుండె దీర్ఘ నిశ్వాసాన్ని విడువగా "ఏమి జీవితాలు!" అని గొణుక్కున్నాడు నాగయ్య.

దూరంగా యెక్కడో లారీ రొద విన్పించింది. నాగయ్య దేహంలోని రక్తం చలిగాలిని వాసనచూసింది.